సాక్షి
కామారెడ్డి
గురువారం ⋅ 4 ⋅ జూలై ⋅ 2024



సైబర్ నేరాలపై అవగాహన

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. జిల్లాలోని పలుచోట్ల అవగాహన కల్పించారు.

- 9లో ▸



ఎంపీటీసీలకు వీడ్కోలు

మండల పరిషత్‌ల పదవీ కాలం ముగియడంతో జిల్లా వ్యాప్తంగా పాలకవర్గాలను అధికారులు సన్మానించారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
37.1 /22.2

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. ఈదురు గాలులు వీస్తాయి. పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

వెండి పతకం సాధించిన క్రీడాకారుడికి అభినందన



పిట్లం(జుక్కల్): చెస్ బాక్సింగ్ జాతీయ చాంపియన్‌షిప్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అభినందించారు. జూన్ 7, 8, 9తేదీల్లో కేరళలో నిర్వహించిన టోర్నీ పిట్లం ప్రతిభ హైస్కూల్ నిర్వాహకుడి తనయుడు విజయ్ రాఘవేంద్ర తన సత్తా చాటాడు. సీనియర్ పురుషుల విభాగంలో వెండి పతకాన్ని సాధించి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. క్రీడాకారుడిని కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం కలెక్టర్ సంగ్వాన్ అభినందించారు.

మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అరుణ



ఎల్లారెడ్డి: మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా చిట్టిమిల్ల అరుణ ఎంపికయ్యారు. ఈ మేరకు మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత బుధవారం బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కాంగ్రెస్ నాయకులు అరుణను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సాయిబాబా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెన్న లక్ష్మణ్, గయాజొద్దీన్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి



కామారెడ్డి టౌన్: జిల్లా గురువారం విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని కామారెడ్డి విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీ హయాంలో నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఎన్‌టీఏ చెలగాటం ఆడారన్నారు. ఇందుకు నిరసనగా విద్యాసంస్థల బంద్ పిలుపునిచ్చినట్లు తెలిపారు. బంద్‌కు విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐల జిల్లా అధ్యక్షుడు ఐరెని సందీప్‌కుమార్, ముదాం అరుణ్‌కుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి సురేష్, నాయకులు భరత్, మణికంఠ, సరిచంద్, మధు పాల్గొన్నారు.

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



రాజంపేట: గ్రామాల్లోని నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఆర్‌డీవో చందర్ నాయక్ అన్నారు. బుధవారం రాజంపేట మండల కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి కమ్యూనిటీ ప్లాంటేషన్‌లో భాగంగా గుంతలను ఆయన పరిశీలించారు. కమ్యూనిటీ ప్లాంటేషన్‌లో పండ్ల మొక్కలు పెంచేలా చర్య లు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. నర్సరీలో ఖాళీ బ్యాగులు లేకుండా విత్తనాలు నాటేలా చూడాలని ఎఫ్ఏలను ఆదేశించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు అందించారు. ఎంపీడీవో రాజేశం, ఎంపీవో రఘురాం, ఏపీఎం సాయిలు, టీఏ భాస్కర్, రాజు, కంప్యూటర్ ఆపరేటర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ అవిశ్వాస ఫలితంపై స్టే ఎత్తివేత?

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణపై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస ఫలితాన్ని నిలిపివేస్తూ హైకోర్టు ఇచ్చిన స్టేను ఎత్తివేసినట్లు సమాచారం. గత మే నెల 18న చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గినప్పటికీ కోర్టు స్టే విధించిన నేపథ్యంలో ఫలితాన్ని వెల్లడించకుండా నిలిపివేశారు. కాగా కోర్టులో స్టే ఎత్తివేయాలని కౌన్సిలర్ల తరఫు న్యాయవాది అప్పీల్ చేయగా పరిశీలించిన న్యాయమూర్తి స్టే ఎత్తివేస్తూ తీర్పు వెలువరించినట్లు తెలిసింది. అయితే ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. దీంతో కుడుముల సత్యనారాయణ చైర్మన్ పదవికి దూరం కానున్నారు.

కలెక్టరేట్‌లో బయోమెట్రిక్!

- నమయానికి చేరుకుని వేలిముద్ర వేయాల్సిందే
- అటెండర్ నుంచి జిల్లా అధికారి వరకు..
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు





సాక్షి, కామారెడ్డి: కలెక్టరేట్‌లో అధికారులు, ఉద్యోగులు సమయపాలన పాటించేలా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బయోమెట్రిక్ విధానం అమలుకు శ్రీకారం చుడుతున్నారు. శాఖల వారీగా అధికారులు, సిబ్బంది వివరాలు, వేలిముద్రలను సాంకేతిక సిబ్బందితో సేకరిస్తున్నారు. దీంతో మరికొన్ని రోజుల్లోనే బయోమెట్రిక్ అమలులోకి రానున్నట్లు తెలుస్తోంది. సమీకృత కలెక్టరేట్ భవనంలో అన్ని శాఖల్లో కలిపి ఐదు వందల మందికి పైగా ఉద్యోగులు ఉంటారు. ఇంతకాలం అధికారులు, సిబ్బంది ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు పోతున్నారన్న దానిపై ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. అయితే ఇటీవల కలెక్టర్‌గా వచ్చిన ఆశిష్ సంగ్వాన్ అధికారులు, ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. చాలా మంది ఇష్టారీతిన రాకపోకలు సాగిస్తున్నారని గమనించి సమయపాలన పాటించాలంటే కచ్చితంగా బయోమెట్రిక్ విధానం అమలు చేయాలని నిర్ణయానికి వచ్చి అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో కలెక్టరేట్ అధికారులు బయోమెట్రిక్ పరికాలను తెప్పించారు. అధికారులు, ఉద్యోగుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు వారి వేలిముద్రలను కూడా తీసుకుంటున్నారు. అందరి వివరాలను నమోదు చేసిన తర్వాత బయోమెట్రిక్ ఆధారిత హాజరు ప్రక్రియ ప్రారంభం కానుంది.

అన్ని విభాగాల ఉద్యోగులకు..

కలెక్టరేట్‌లో పనిచేసే అన్ని విభాగాలకు చెందిన అటెండర్ నుంచి జిల్లాస్థాయి అధికారి వరకు అందరూ కచ్చితంగా వేలిముద్ర వేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం రెండు మిషన్లు తెప్పించారు. ఉదయం 10.30 గంటలలోపు ఉద్యోగులు హాజరు కావాల్సి ఉంటుంది. అలాగే సాయంత్రం 5 గంటల తర్వాత రిలీవ్ అవుతారు. విధులకు హాజరుకావడానికి కలెక్టరేట్‌కు చేరుకోగానే మొదట వేలిముద్ర వేసి తమ కార్యాలయానికి వెళ్లాలి. అలాగే సాయంత్రం డ్యూటీ ముగించుకుని వెళ్లే సమయంలో కూడా తప్పనిసరిగా వేలిముద్ర వేయాల్సి ఉంటుంది. కొందరు ఉద్యోగులు నిజామాబాద్ నుంచి మరికొందరు హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగించేవారికి ఈ నిర్ణయం కొంత ఇబ్బందికరంగా మారనుంది. బస్సులు, రైళ్లలో రావడం, పోవడం వల్ల సమయానికి చేరుకునే పరిస్థితి ఉండదు. అలాంటి వారు ముందుగానే చేరుకునే ప్రయత్నం చేయాలి. గతంలోలాగా ఇష్టం వచ్చినపుడు వచ్చి పోవడం కుదరదు. వేలి ముద్ర వేసిన సమయం రికార్డు అవుతుంది. దీంతో ఆలస్యంగా వచ్చిన వారికి చిక్కులు తప్పవు. ఇదే సమయంలో స్థానికంగా ఉండి కూడా కొందరు ఉద్యోగులు సమయపాలన పాటించడంలో నిర్లక్ష్యం చేస్తుంటారు. అలాంటి వారు కూడా కచ్చితంగా ఉదయం 10.30 లోపు కార్యాలయానికి చేరుకోవాల్సిందే. లేదంటే ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంటుంది.

ఈ-పాలన అమలుకు చర్యలు

జిల్లాలోని ఆయా శాఖల్లో ఈ-పాలన అమలుకు కలెక్టర్ చర్యలు మొదలుపెట్టారు. మొదటగా రెవెన్యూ శాఖలో ఈ-పాలన అమలు చేయడానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో కలెక్టరేట్‌లోని రెవెన్యూ యంత్రాంగం అందుకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమైంది. రెవెన్యూలో అమలు చేసిన తర్వాత ముఖ్యమైన మరికొన్ని శాఖల్లో అమలు చేస్తూ, అన్ని శాఖలకు విస్తరించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు.

పాలన సక్రమంగా సాగాలనే ఉద్దేశంతో..

పాలన సక్రమంగా సాగాలంటే మొదట ఉద్యోగులు సమయపాలన పాటించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ భావిస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి తమ పనుల కోసం కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు ఆయా శాఖలకు వెళ్లినపుడు సంబంధిత అధికారి, సిబ్బంది అందుబాటులో ఉండడం వల్ల వారికి పనులు సకాలంలో జరుగుతాయి. ఇదే సమయంలో ఎవరి పని వారు చేసుకోగలుగుతారు. పనుల్లో పెండింగ్ అనేది ఉండదు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి ప్రారంభమైన తర్వాత కూడా కొన్ని శాఖల అధికారులు తాపీగా వచ్చి వెళ్లేవారు. మరికొందరు ప్రజావాణికి వెళ్లకుండా తమ సిబ్బందిని పంపించేవారు. కలెక్టర్‌గా ఆశిష్ సంగ్వాన్ వచ్చిన తర్వాత ప్రజావాణికి అధికారులంతా హాజరవుతున్నారు. ఇది మొదటి మార్పుగా భావిస్తున్నారు. ఇప్పుడు బయోమెట్రిక్ అమలు చేయడం ద్వారా ఉద్యోగులంతా సమయపాలన పాటించగలుగుతారు. ఫలితంగా ప్రజలకు మెరుగైన సేవలందుతాయి. ఇది మారో మార్పునకు నాంది అవుతుంది.

‘ధరణి’పై సర్కార్ ఫోకస్!

- జిల్లాలో కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్
- మందకొడిగా సమస్యల పరిష్కారం
- ఇంకా పరిష్కరించాల్సినవి ఐదు వేలకు పైమాటే..



కామారెడ్డి క్రైం: ధరణి కారణంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి దృష్టి పెట్టింది. మూడు నెలల క్రితం 15 రోజుల పాటు కొనసాగిన స్పెషల్ డ్రైవ్ పార్లమెంటు ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయిన విషయం తెలిసిందే. కోడ్ ముగిసిన తర్వాత మరోసారి ధరణిలో పెండింగ్ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించిన సర్కారు స్పెషల్ డ్రైవ్‌ను కొనసాగించాలని జిల్లాల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో వారం రోజులుగా కలెక్టర్ కార్యాలయంతో పాటు అన్ని ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో స్పెషల్ డ్రైవ్‌ను కొనసాగుతోంది. అధికారుల అలసత్వం కారణంగా సమస్యల పరిష్కారం మందకొడిగా సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఇకనైనా తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందేమోనని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్ ఆదేశాలతో..

దరఖాస్తుల పరిష్కారం వేగవంతంగా చేయాలని మొన్నటికి మొన్న సీసీఎల్ఏ చీఫ్ కమీషనర్ నవీన్ మిట్టల్ అన్ని జిల్లాల కలెక్టర్‌లు, రెవెన్యూ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో స్పెషల్ డ్రైవ్‌ను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారానికి రికార్డుల పరిశీలన, క్షేత్ర స్థాయిలో విచారణ, ఆన్‌లైన్‌లో నమోదు లాంటి ప్రక్రియలు పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం రెవెన్యూ యంత్రాంగం ఆయా పనుల్లో నిమగ్నమైంది. కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. అలసత్వానికి, అవినీతికి పెట్టింది పేరైన రెవెన్యూ శాఖలో రైతుల సమస్యల పరిష్కారం ఏ మాత్రం జరుగుతుందో వేచి చూడాలి.

మొత్తం దరఖాస్తులు 49,748..

ధరణి కారణంగా తలెత్తిన సమస్యలు అన్నీ ఇన్నీ కావు. ధరణి వచ్చాక ఆన్‌లైన్‌లో రికార్డులను నమోదు చేసే క్రమంలో అనేక తప్పిదాలు దొర్లాయి. పేర్లు, సర్వే నంబర్లు, భూమి రకం, భూమి స్వభావం, రైతు పేరు, తండ్రి పేరు, చిరునామా, శివారు, విస్తీర్ణం లాంటి వివరాల్లో అనేక తప్పులు నమోదు కావడంతో దాదాపు ఐదేళ్లుగా రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికీ చాలారకాల సమస్యలకు మీసేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా ఇవ్వలేదు. ఎప్పుడు ఇస్తారో కూడా తెలియదు. వాటిలో కొన్నింటికి మాత్రమే మీ సేవల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే మాడ్యూల్స్ అందుబాటులో ఉన్నాయి. ఇలా కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఆన్‌లైన్ ద్వారా నమోదైన ఫిర్యాదులు 49,748 ఉండగా వాటిలో 33,730 దరఖాస్తులను అధికారులు ఆమోదించి 8,749 తిరస్కరించారు. పార్లమెంటు ఎన్నికలకు ముందు 20 రోజుల పాటు, తాజాగా వారం రోజులుగా నడుస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో చిన్న చిన్న సమస్యలకు పరిష్కారాలు లభిస్తున్నట్లు తెలుస్తోంది. వాటిలో కూడా చాలావరకు తిరస్కరణకు గురవుతున్నాయని చెబుతున్నారు. జూలై 1 నాటికి కలెక్టర్ లాగిన్‌లో 155, అదనపు కలెక్టర్ లాగిన్‌లో 442, ఆర్డీవోల లాగిన్‌లలో 1,716, తహసీల్దార్ లాగిన్‌లలో 3,013 ఫిర్యాదులు ఇంకా పరిష్కరించాల్సినవి ఉన్నాయి. మొత్తం 5,326 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి.

‘ఇంటర్’లో ప్రవేశాలకు గడువు పెంపు



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారి షేక్‌సలాం

- ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారి షేక్‌సలాం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఇంటర్‌లో ప్రవేశాల కోసం ఈ నెల 31 వరకు గడువును పెంచినట్లు ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారి షేక్‌సలాం పేర్కొన్నారు. నాగిరెడ్డిపేటలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం స్థానిక ఎంపీపీ వినీత రెడ్డి, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డితో కలిసి పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయని, వాటిల్లోని 2024–25కు సంబంధించి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఇప్పటివరకు 1,700 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారన్నారు. కాగా ఇంటర్‌లో ప్రవేశాలకు గతనెల 30వరకు గడువు ఉండగా ప్రస్తుతం గడువును ఈ నెల 31 వరకు పొడిగించినట్లు ఆయన వివరించారు. కాగా నాగిరెడ్డిపేటలో ఏర్పాటు చేసిన కళాశాలలో బుధవారం తరగతులను ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపేట ఎంపీపీ వినీతరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి, నాగిరెడ్డిపేట ఎంపీటీసీ సభ్యురాలు మాధవి, ఎంఈవో వెంకటేశం, కళాశాల ప్రిన్సిపాల్ హేమచందర్, గోపాల్‌పేట హైస్కూల్ హెచ్ఎం వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- జిల్లా జనరల్ ఆస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ఆయన బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈవోపీ, ట్రామా, మహిళా,పురుష, పోస్ట్ ఆపరేటీవ్, ఆపరేషన్ థియేటర్, డయాలసిస్, ఐసీయూ విభాగాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి వచ్చే రోగులు ఇబ్బందులు పడకుండా చూడాలని సూపరింటెండెంట్ డాక్టర్ రాంసింగ్‌ను ఆదేశించారు.

రోగులకు సంబంధించి ఏవైనా అవసరాలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. మెడికల్ కాలేజ్ ఆధ్వర్యంలో జిల్లా జనరల్ ఆస్పత్రి మరింత ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. ఇందుకోసం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డిప్యూటీ సూపరింటెండెంట్ అఫిస్‌గోరి, ఆయా విభాగాల హెచ్‌వోడీలు, వైద్యులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలు లేకుండా చర్యలు తీసుకోవాలి

మాతా, శిశు మరణాలు సంభవించకుండా సమర్థవంతంగా వైద్య సేవలు అందించాలని కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో మాతాశిశు మరణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చిన ఈ కాలంలో ప్రసవ సమయంలో మాతృ మరణాలు సంభవించకుండా జాగ్రత్త పడడం వైద్యాధికారుల కర్తవ్యమని పేర్కొన్నారు. ఏఎన్ఎం స్థాయి నుంచి వైద్యాధికారి, జిల్లా స్థాయిలో ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి వరకూ అందరూ బాధ్యతగా ఉండాలన్నారు. నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, వైద్య విధాన పరిషత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండల పరిషత్‌లకు ప్రత్యేకాధికారులు

- నేటి నుంచి అమల్లోకి..



సాక్షి, కామారెడ్డి: మండల పరిషత్ పాలక వర్గాల పదవీకాలం బుధవారం ముగియడంతో ఆయా మండలాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 4 నుంచి మండల పరిషత్‌లకు సంబంధించి వ్యవహారాలను ప్రత్యేకాధికారులే పర్యవేక్షిస్తారు. వారి ఆధ్వర్యంలో ఎంపీడీవోలు, సిబ్బంది పనిచేయాల్సి ఉంటుంది. ఐదేళ్ల పదవీకాలం ముగియడంతో ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులందరూ మాజీలు అయ్యారు. మళ్లీ ఎన్నికలు నిర్వహించే దాకా ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనుంది.

మండలం	అధికారి	హోదా	మండలం	అధికారి	హోదా
బాన్సువాడ	రమేశ్ రాథోడ్	ఆర్డీవో, బాన్సువాడ	మద్నూర్	డి.శ్రీనివాస్‌రావ్	జిల్లా పంచాయతీ అధికారి
భిక్కనూరు	జి.రజిత	జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి	నాగిరెడ్డిపేట	జి.వీరాస్వామి	ఏడీఏ, సీడ్‌ఫాం, మాల్తుమ్మెద
బీబీపేట	పి.రమ్య	జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్	నస్రుల్లాబాద్	టి.దయానంద్	ఈడీ, ఎస్సీ కార్పొరేషన్
బిచ్కుంద	బి.చందర్	జిల్లా పరిషత్ సీఈవో	నిజాంసాగర్	వి.విజయభాస్కర్	జిల్లా హార్టికల్చర్ అధికారి
బీర్కూర్	పి.నగేశ్	మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్	పెద్దకొడప్‌గల్	పి.కిషన్	జిల్లా ఆడిట్ అధికారి
దోమకొండ	జి.భాగ్యలక్ష్మి	జిల్లా వ్యవసాయ అధికారి	పిట్లం	టి.అంబాజీ	జిల్లా గిరిజన సంక్షేమ అధికారి
గాంధారి	బావయ్య	జిల్లా సంక్షేమ అధికారి	రాజంపేట	ఎం.రోహిత్‌రెడ్డి	జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి
జుక్కల్	ఎస్.అనిల్‌కుమార్	ఏడీఏ, సీడ్‌ఫాం, బొప్పాస్‌పల్లి	రామారెడ్డి	కే.వరదారెడ్డి	జిల్లా మత్స్యశాఖ అధికారి
కామారెడ్డి	వై.రఘునాథ్‌రావ్	ఆర్డీవో, కామారెడ్డి	సదాశివనగర్	సతీశ్‌యాదవ్	అసిస్టెంట్ డైరెక్టర్, భూగర్భజలశాఖ
లింగంపేట	ఎస్.రాజు	జిల్లా విద్యాశాఖ అధికారి	తాడ్వాయి	ఆర్.రాజారాం	జిల్లా ప్రణాళిక అధికారి
మాచారెడ్డి	డి.శ్రీనివాస్	ఏడీ, సర్వే ల్యాండ్స్	ఎల్లారెడ్డి	ఎం.ప్రభాకర్	ఆర్డీవో, ఎల్లారెడ్డి

సీజనొస్తున్నా.. సిద్ధం కాలే!

- పూర్తి కాని వరదగేట్ల మరమ్మతులు



గేట్లకు మరమ్మతులు చేస్తున్న వర్కర్లు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరదలు వచ్చే సీజన్ వచ్చినా వరద గేట్ల మరమ్మతులు, ఫ్లడ్ కంట్రోల్ రూం పనులు ఇంకా పూర్తి కాలేదు. ప్రాజెక్ట్ నుంచి మిగులు జలాలను గోదావరిలోకి వదలడానికి 42 వరద గేట్లను నిర్మించారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో 2021లో గేట్లు ఎత్తితే మొరాయించాయి. కొన్ని గేట్లు పనికి రాకుండా పోయాయి. దీంతో 2022లో అప్పటి ప్రభుత్వం మరమ్మతుల కోసం రూ.17.5 కోట్ల నిధులను మంజూరు చేసింది. అప్పటి నుంచి పనులు సాగుతూనే ఉన్నాయి. అయినా ఇప్పటి వరకు 30 గేట్ల మరమ్మతులు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 12 గేట్ల మరమ్మతులు అసంపూర్తిగా ఉన్నాయి. ఎగువ నుంచి వరదలు వచ్చి ప్రాజెక్ట్ నిండితే మరమ్మతు పనులు చేపట్టే అవకాశం లేదు. అలాగే ప్రాజెక్టు నుంచి నదిలోకి నీరు వదలాల్సి వస్తే మరమ్మతులు పూర్తి చేసిన 30 గేట్లు మాత్రమే పని చేస్తాయి. దీంతో డ్యాం నీటి ఒత్తిడికి గురయ్యే ప్రమాదం లేకపోలేదు. పనులు వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ప్రాజెక్ట్ నుంచి ఉచితంగా కరెంట్ సరఫరా చేస్తున్నారు. అయినా రెండేళ్లయిన గేట్ల మరమ్మతులు పూర్తి కాలేదు.

చర్యలు శూన్యం

ప్రాజెక్ట్ ఆనకట్టపై ఫ్లడ్ కంట్రోల్ రూం నిర్మాణం కోసం రెండేళ్ల క్రితం ప్రభుత్వం రూ.60 లక్షలు మంజూరు చేసింది. పనులు ఇంకా పూర్తి కాలేదు. ఏడాది నుంచి పనులు సాగకున్నా అధికారులు చర్యలు తీసుకోలేదు. ప్రాజెక్ట్ వద్ద పాత ఫ్లడ్ కంట్రోల్ రూం ఉంది. కానీ స్కాడా విధానం రావడంతో సీసీ టీవీలు, కంప్యూటర్ సామగ్రి ఎక్కువైంది. అధికారులు, సిబ్బంది బయటనే ఉండాల్సి వస్తుంది. దీంతో మరో గది నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదు.

ఎలాంటి ఇబ్బంది ఉండదు

ప్రాజెక్ట్ వద్ద 30 వరద గేట్లకు మరమ్మతులు పూర్తయ్యాయి. వరదలు వస్తే గోదావరిలోకి నీటిని వదలడానికి ఇబ్బంది లేదు. మిగతా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ఫ్లడ్ కంట్రోల్ రూం పనులు కూడా ప్రారంభించేలా చూస్తాం.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

క్లుప్తంగా

కరెంటు సౌకర్యం కల్పించండి

భిక్కనూర్: జంగంపల్లిలో నివాసముంటున్న పేదల ఇళ్లకు కరెంటు సౌకర్యంతో పాటు మంచినీటి వసతి కల్పించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి నరసింహులు కోరారు. బుధవారం కాలనీవాసుల ఆధ్వర్యంలో మండల అభివృద్ధి కార్యాలయానికి తరలి వచ్చి ఎంపీడీవో ప్రవీణ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలి

భిక్కనూర్: తెలంగాణ యూనివర్సిటీలో ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న నాలుగో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని సౌత్ క్యాంపస్ విద్యార్థులు కోరారు. ఈ మేరకు బుధవారం సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్కు వినతి పత్రం అందజేశారు అనంతరం మాట్లాడుతూ.. ఈ నెల 17 నుంచి వచ్చే నెల 5 వరకు డీఎస్సీ టీఆర్టీ ప్రవేశ పరీక్ష షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసిందని గుర్తు చేశారు. కాంపిటేటివ్ ఎగ్జామ్స్ ఉన్నందున సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సౌత్ క్యాంపస్ అధికారులు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలి



కామారెడ్డి టౌన్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను తక్షణమే విడుదల చేయాలని ఏబీవీపీ నేతలు కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో విద్యార్థులతో కలిసి బిక్షాటన కార్యక్రమంలో ఏబీవీపీ నేతలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ రోహిత్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా రూ.8 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సర్టిఫికెట్‌లు ఇవ్వకుండా కళాశాల యజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని లేని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్, నాయకులు అల్తాఫ్, ప్రత్యూష, మానస, ప్రణీత, బలరాం, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన బాలామృతం పంపిణీ

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కాలం చెల్లిన బాలమృతం పంపిణీ చేసినట్లు గర్భిణులు, బాలింతలు వాపోయారు. సదరు అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు సైతం కాలం చెల్లిన బాలమృతం పంపిణీ చేశారని వారు పేర్కొన్నారు. అధికారులు ఇకనైనా స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

'డైట్' అక్రమాలపై విచారణ

- ఆదేశాలు జారీ చేసిన విద్యాశాఖ కమిషనర్
- వేధిస్తున్నాడని ప్రిన్సిపాల్‌పై.. అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని అధ్యాపకుడిపై ఫిర్యాదులు
- రూ.37 లక్షల దుర్వినియోగం చేశారని ఆరోపణలు
- విచారణ చేపట్టనున్న వరంగల్ ఆర్‌జేడీ



నాగారంలోని డైట్ కళాశాల

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌తోపాటు ఓ అధ్యాపకుడి వ్యవహారం, రూ.37 లక్షల దుర్వినియోగంపై ఫిర్యాదులు, ఆరోపణల నేపథ్యంలో విచారణ చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి విచారణ చేపట్టనున్నారు. డైట్ కళాశాలలో గత కొన్నేళ్లుగా అనేక అక్రమాలు జరుగుతున్నట్లు పాఠశాల విద్యాశాఖకు ఫిర్యాదులు వెళ్లాయి.

కళాశాల ప్రిన్సిపాల్ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, కొందరు అధికారులు ఓ వర్గానికి వత్తాసు పలుకుతూ మరో వర్గానికి చెందిన విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులు అందాయి. అలాగే అటెన్‌డెన్స్ విషయంలో విద్యార్థులను అనేక ఇబ్బందులకు గురి చేయడంతోపాటు కళాశాలకు రాకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం లేకున్నప్పటికీ అటెన్‌డెన్స్‌ను సాకుగా చూపి ఇబ్బందులకు గురి చేస్తున్నారని కొందరు విద్యార్థులు గతంలో సైతం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విద్యార్థులు చెల్లించే పరీక్ష ఫీజును కళాశాల అకౌంట్‌లో జమ చేయాల్సి ఉండగా, ఓ అధికారి వ్యక్తిగతంగా తన ఖాతాలో జమ చేసుకున్నాడని, అలాగే కళాశాల నిధులు రూ.37లక్షలు లెక్కలేకుండా పోయాయనే ఆరోపణలున్నాయి. గత కొన్నేళ్లుగా ఒకే దగ్గర పని చేస్తున్న అధికారులు ఈ అక్రమాలకు తెరలేపినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేవలం ఒకటి రెండు రోజుల తేడాలో అటెన్‌డెన్స్ తక్కువగా ఉందంటూ అడ్మిషన్లు రద్దు చేయడంతో పలువురు విద్యార్థులు సీటు వచ్చినా రోడ్డునపడ్డారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాల విద్యార్థులు గతంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, అధికారులు నామమాత్రంగా విచారణ చేపట్టి చేతులు దులుపుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. తాజాగా డైట్ కళాశాల వ్యవహారంపై వరంగల్ ఆర్‌జేడీ విచారణ చేపట్టనున్నారు.

వినియోగదారులకు అవగాహన అవసరం

- గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తాన్యానాయక్



మాట్లాడుతున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తాన్యానాయక్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ప్రస్తుత పరిస్థితుల్లో వినియోగదారులు ప్రతి అంశంపై కచ్చితమైన అవగాహన కలిగి ఉండాలని గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తాన్యానాయక్ అన్నారు. ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో బుధవారం ఆహార కల్తీపై చైతన్య సదస్సులు నిర్వహించారు. వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అధ్యక్షతన కిషన్‌గంజ్ ఏరియాలో సదస్సు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు ఆహార కల్తీపై వివరించారు. ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు కేటాయించిన మొబైల్ టెస్టింగ్ ల్యాబ్‌లో ఆహార కల్తీ పరీక్షలు నిర్వహించారు. తాన్యానాయక్ మాట్లాడుతూ.. కందిపప్పు, కారంపొడుల్లో సింథటిక్ కలర్స్, మెటనిల్ ఎల్లో, సూడాన్ కలుపుతున్నారన్నారు. వంటనూనె ప్యాకెట్లపై కుకింగ్ ఆయిల్ అని ముద్రించి, పొద్దు తిరుగుడు, వేరుశనగ బొమ్మలు వేస్తుండడంపై వినియోగదారులు జాగ్రత్త వహించాలని సూచించారు.

చైతన్యం తీసుకురావాలి

వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ.. లాభార్జనే ధ్యేయంగా జరుగుతున్న వ్యాపారంలో ఆహార కల్తీ సర్వసాధారణమైందన్నారు. వినియోగదారుల్లో నిరంతరం చైతన్యం తీసుకురావడమే శ్రీరామరక్ష అన్నారు. పాలల్లో హానికరమైన హైడ్రోజన్ పెరాక్సైడ్, అమ్మోనియం సల్ఫేట్ వాడుతున్నారని, దీనిపై అధికారులు పరిశీలన చేయాలని కోరారు. ఈ నెల 3 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆహార కల్తీపై చైతన్య కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు. జిల్లా మహిళా సంక్షేమ అధికారి ఎస్ రసూల్‌బీ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వమే సరుకులు సరఫరా చేస్తోందన్నారు. నాణ్యతపరంగా ఎలాంటి సమస్యలు లేవన్నారు. బియ్యం మాత్రమే కొన్ని ప్రాంతాల్లో నాసిరకంగా ఉన్నాయన్నారు. విజయ డెయిరీ మార్కెటింగ్ ఆఫీసర్ సుమిత్ర.. విజయ డెయిరీ పాల నాణ్యతను వివరించారు. ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి అధ్యక్ష, కార్యదర్శులు పెందోట అనిల్‌కుమార్, సందు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు వీఎస్ వర్మ, సంయుక్త కార్యదర్శులు మహాదేవుని శ్రీనివాస్, గైని రత్నాకర్, గడప రవికుమార్, బానోత్ సందీప్, దేవేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాంబరాజు చక్రపాణి

రైతు బీమా వయోపరిమితిని పెంచాలి



బోర్లంలో మాట్లాడుతున్న డీఏవో భాగ్యలక్ష్మి

బాన్సువాడ రూరల్: రైతు బీమా వయోపరిమితి 61 ఏళ్లకు పెంచాలని రైతు ప్రజావేదికలో రైతులు డిమాండ్ చేశారు. బోర్లం గ్రామ సహకార సంఘం ఆవరణలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతుబంధు పథకంపై ప్రజావేదిక నిర్వహించి అభిప్రాయాలు సేకరించారు. కామారెడ్డి జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతులు రైతుబంధు పరిమితిని కుటుంబానికి 10 ఎకరాల వరకే పరిమితం చేయాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బోర్లం సహకార సంఘం చైర్మన్ సంగ్రాంనాయక్, దేశాయిపేట్ వైస్ చైర్మన్ అంబర్‌సింగ్, బాన్సువాడ డివిజన్ వ్యవసాయాధికారి అనిల్‌కుమార్, ఏవో సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు బీమా చెక్కుల పంపిణీ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు పద్మాజీవాడి చౌరస్తాలో పలువురికి బీమా చెక్కులను బుధవారం మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పంపిణీ చేశారు. సదాశివనగర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఏనుగు జనార్దన్ రెడ్డి, సతీమణి ప్రతిభలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సభ్యత్వం కలిగి ఉండడంతో బీమా రూ.2 లక్షల చొప్పున బీమా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కమిలి నర్సింలు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బద్దం శ్రీనివాస్ రెడ్డి, కొత్తోళ్ల గంగారాం, విండో చైర్మన్‌లు కమలాకర్ రావు, ప్రభాకర్ రావు, పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బార్ అధ్యక్షుడు ప్రకాశ్

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని మంజీరా నదీ పరివాహక గ్రామాల నుంచి లారీలలో ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. నిలిపివేయాలని కోరుతూ ఈ నెల 5న బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బిచ్కుందలో ధర్నా చేస్తున్నామని బార్ అధ్యక్షుడు, న్యాయవాది ప్రకాశ్ పటేల్ తెలిపారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఖద్గాం, హజ్గుల్, గుండెనెమ్లి క్వారీల నుంచి వే బిల్లులు లేకుండా వందల లారీలలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని అన్నారు. జూన్ 22న జిల్లా కలెక్టర్, ఎస్పీని కలిసి అక్రమ రవాణాపై వినతి పత్రం ఇచ్చామన్నారు. జిల్లా అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో మండల కేంద్రంలో రోడ్డుపై ధర్నా, రాస్తా రోకో చేస్తున్నామని, ప్రజలు ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అధికారులు అక్రమ రవాణా అరికట్టకుంటే కోర్టును ఆశ్రయిస్తామన్నారు.

విద్యార్థులకు యూనిఫాం..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మోడల్ స్కూల్ విద్యార్థులకు ప్రిన్సిపల్ సాయిబాబా బుధవారం యూనిఫాంలను పంపిణీ చేశారు. పాఠశాలలోని 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన యూనిఫాంలను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపా రు. వైస్ ప్రిన్సిపల్ శశిశంకర్, ఉపాధ్యాయులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ ఏడాది విద్యా సంవత్సరానికి 5 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల ప్రాంతీయ సమన్వయ అధికారిణి అలివేలు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఆన్‌లైన్‌లో రూ.100 రుసుము చెల్లించి ఈ నెల 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే 5 నుండి 9వ తరగతి వరకు గురుకులాల్లో చదివే విద్యార్థులు సీట్ల బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, ఇందుకోసం ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఏఎన్ఎం ఉద్యోగానికి..

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి గిరిజన కళాశాల బాలుర వసతి గృహంలో పొరుగు సేవల కింద ఏఎన్ఎంగా నెలకు రూ.22,750 గౌరవ వేతనంతో పని చేయడానికి అర్హులైన గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమాధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వైకుంఠధామం పరిశీలన

బిచ్కుంద(జుక్కల్): తక్కడ్‌పల్లి గ్రామ పంచాయతీని బుధవారం ఎంపీవో మహబూబ్ సందర్శించారు. రికార్డులు పరిశీలించి కార్యదర్శితో గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైకుంఠధామం, వన నర్సరీ, పల్లె ప్రకృతివనం, కంపోస్టుషెడ్డు పరిశీలించారు. పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేయాలని కార్యదర్శిని ఆదేశించారు. గ్రామంలో సేకరించిన చెత్త కంపోస్టు షెడ్డుకు తరలించి ఎరువు తయారు చేయాలన్నారు.

ప్రజాసేవతోనే నాయకులకు గుర్తింపు

- జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్



బీబీపేటలో మండల పరిషత్ సమావేశంలో పాల్గొన్న ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు

బీబీపేట: ప్రజలకు చేసిన సేవలతోనే రాజకీయ నాయకులకు మంచి గుర్తింపు ఉంటుందని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీపీ బాలమణి అధ్యక్షతన నిర్వహించిన ఎంపీటీసీలు, జెడ్పీటీసీల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీల పదవీ కాలం పూర్తి కావడంతో వారికి శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. డీసీఎంఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు ఓట్లు వేసి గెలిపించిన తర్వాత వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందించడమే రాజకీయ లక్షణమని, నాయకులు చేసిన సేవలతోనే రాబోయే రోజుల్లో ఉన్నత పదవులు పొందుతారని అన్నారు. ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం నిషేధించాలి



బాన్సువాడ: ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని బీర్కూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ అన్నారు. బుధవారం పాఠశాలలో ప్లాస్టిక్ రహిత దినోత్సవం నిర్వహించారు. ప్లాస్టిక్ బ్యాగులు వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్లాస్టిక్‌ను వాడొద్దని సూచించారు. ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, లోహిత ఉన్నారు.

రక్తదానం

కామారెడ్డి అర్బన్: భిక్కనూర్‌కు చెందిన నర్సింలు అనే వ్యక్తి మూత్ర పిండాల వ్యాధితో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. అత్యవసరంగా ఆయనకు ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో హైదరాబాద్‌కు చెందిన మురికి వంశీకృష్ణ మానవతా దృక్పథంలో స్పందించి బుధవారం రక్తదానం చేసినట్టు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు తెలిపారు. కామారెడ్డి రక్తదాతల సమూహం ద్వారా వంశీకృష్ణ ఇప్పటికి 7 సార్లు రక్తదానం చేశారని బాలు చెప్పారు.

క్రైం కార్నర్

పాముకాటుతో మహిళ మృతి




కమల మృతదేహం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మున్సిపాలిటీ పరిధిలో ని బాలాజీనగర్ తండాకు చెందిన రుడావత్ కమల(40) పాముకాటుతో మృతి చెందిందని ఎస్సై మహేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కమల మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో కాలికి పాము కాటేసింది. కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కామారెడ్డికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రైమరీ స్కూల్‌లో ట్యాబ్ చోరీ

మోపాల్: మండలంలోని కంజర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం రాత్రి ట్యాబ్‌తోపాటు రూ.800 చోరీ అయ్యాయి. పోలీసులు, హెచ్‌ఎం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. విద్యార్థుల హాజరు, మధ్యాహ్నభోజనం వివరాలను రోజూవారీగా యాప్‌లో అప్‌లోడ్ చేసేందుకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ను రోజూలాగే శనివారం సాయంత్రం ఆఫీస్ గదిలోని బీరువాలో పెట్టి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం గది తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించిన హెచ్‌ఎం పోలీసులకు ఫిర్యాదుచేశారు. ట్యాబ్‌తోపాటు బెల్టులు, టైలు విక్రయించగా వచ్చిన రూ.800 నగదును సైతం దుండగులు ఎత్తుకెళ్లారు. ట్యాబ్ విలువ సుమారు రూ.30వేల వరకు ఉంటుందని తెలిసింది. హెచ్‌ఎం రాజమల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు బుధవారం తెలిపారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్‌ల అప్పగింత



బాధితుడికి ఫోన్ అందజేస్తున్న ఏఎస్సై సీతారామమ్మ


బాన్సువాడ : బీర్కూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీకి గురైన సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు ఏఎస్సై సీతారామమ్మ బుధవారం అందజేశారు. బీర్కూర్, బైరాపూర్, నస్రూల్లాబాద్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు ఇటీవల తమ సెల్‌ఫోన్‌లు పోయాయని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్లను గుర్తించిన పోలీసులు వాటిని రికవరీ చేసి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

పిచ్చికుక్కల దాడి

- ఐదుగురికి గాయాలు
- భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లిలో ఘటన

భిక్కనూరు: మండలంలోని రామేశ్వరపల్లిలో పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. బుధవారం ఐదుగురిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజా వద్ద ఓ వ్యక్తిని కరిచిన కుక్కలు రామేశ్వర్‌పల్లి వైపు వచ్చాయి. వ్యవసాయ బావి వద్దకు వెళ్తున్న మహిళపై దాడి చేసి ఆ తరువాత గ్రామంలోకి ప్రవేశించిన కుక్కల గుంపు గొల్లపల్లి వినోద్గౌడ్, సందుగారి లలిత, పైతరి సుశీల, గొల్లపల్లి నాగరాజుగౌడ్, నాగర్తి రాధవ్వపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. బాధితులను గ్రామస్తులు కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో కుక్కల బెడదను నివారించాలని వారు కోరుతున్నారు.

ఆరు కిలోల గంజాయి పట్టివేత



నిజామాబాద్‌నాగారం: నగరంలోని బైపాస్ రోడ్డులో బుధవారం ఆరు కిలోల గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిణి స్వప్న తెలిపారు. దుబ్బ ప్రాంతంలోని ఓ సత్సంగ్ సెంటర్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో గంజాయి విక్రయిస్తున్నారే సమాచారం మేరకు దాడి చేశామని, ఇర్ఫాన్‌ఖాన్, మహమ్మద్ యూసుఫ్ వద్ద 6 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. నిందితుల నుంచి రెండు వాహనాలతోపాటు మూడు ఫోన్లు, రూ.10,090 నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం దాడిలో సిబ్బంది నర్సింహచారి, హమీద్, భోజన్న, శివకుమార్, మంజుల, ఆశన్న, లక్ష్మణ్, గంగారాం, రాజన్న పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య



ఖలీల్‌వాడి/డిచ్‌పల్లి: ఆర్థిక ఇబ్బందుల కారణంగా నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలోని మాధవనగర్ వద్ద రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయిరెడ్డి బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. వర్ని మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన సాయికుమార్(28) కూలీ పనులు చేస్తూ జీవించేవాడు. బుధవారం ఉదయం 8 గంటలకు మాధవ నగర్ రైల్వేగేట్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు చేసిందని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పోక్సో కేసు నమోదు

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రేమ పేరుతో బాలికను మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం ఉప్పుగూడకు చెందిన కాలే భాస్కర్ ఇన్‌స్టాగామ్‌లో పరిచయమయ్యాడు. బ్లూ డార్ట్ కంపెనీ(శంషాబాద్ ఎయిర్‌పోర్టు)లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న భాస్కర్ పెళ్లి చేసుకుంటానని నమ్మించడంతో సదరు బాలిక ఇంట్లో ఎవరికీ చెప్పకుండా హైదరాబాద్‌కు వెళ్లిపోయింది. ఇద్దరూ కలిసి గండిమైసమ్మ ప్రాంతంలో రూము అద్దెకు తీసుకొని ఉంటున్నారు. ఇదిలా ఉండగా, బాలిక తండ్రి తన కూతురు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా బాలిక ఉంటున్న ప్రదేశాన్ని గుర్తించారు. భాస్కర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ అనంతరం పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో ఎస్సై చైన్యకుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

నిజామాబాద్‌నాగారం: అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రిటైర్ అయ్యే ఉద్యోగులకు వారసత్వ హక్కు కల్పించాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో బుధవారం ధర్నరా నిర్వహించి అదనపు కలెక్టర్ అంకిత్, ఐసీడీఎస్ పీడీ రసూబీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ.. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన 1334ను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులు గత సెప్టెంబర్‌లో నిర్వహించిన 24 రోజుల సమ్మె సందర్భంగా అప్పటి ప్రభుత్వం, మంత్రులు అధికారుల సమక్షంలో ఇచ్చిన హామీ మేరకు 65 సంవత్సరాలు నిండిన టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. సమ్మె కాలపు వేతనాలను చెల్లించాలని, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా వేతనాలను పెంచి ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కే దేవగంగు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జై.శంకర్‌గౌడ్ అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా కోశాధికారి పి.చంద్రకళ, ఉపాధ్యక్షులు సూర్యకళ, శివరాజమ్మ, కరుణ, నాయకులు ఎలిజబెత్ రాణి, విజయ, జ్యోతి, సందీప, సరిత, గోదావరి, లక్ష్మి, అరుణ, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

భర్త ఇంటి ఎదుట ధర్నా



భర్త ఇంటి ఎదుట కుమారులతో కలిసి బైఠాయించిన అశ్విని

ఆర్మూర్‌టౌన్: తనకు న్యాయం చేయాలని కోరుతూ ఆర్మూర్ పట్టణానికి చెందిన సాత్‌పుతే గిర్మాజీ అశ్విని తన ఇద్దరు పిల్లలతో కలిసి భర్త ఇంటి ఎదుట బుధవారం బైఠాయించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన అర్వింద్‌తో 11 సంవత్సరాల క్రితం వివాహమైందని, ఇద్దరు కుమారులు ఉన్నారని తెలిపింది. తన భర్త అర్వింద్ వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని గత మూడు సంవత్సరాలుగా తమను దూరం పెట్టాడని ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్త ఆచూకీ చెప్పకుండా అత్తింటివారు గోప్యంగా ఉంచుతున్నారని, తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. తనను ఇంట్లోకి రాకుండా అడ్డుకుంటున్న అత్తపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని హైవే సిబ్బందికి సీఐ నరేశ్ సూచించారు. మండలంలోని జాతీ యరహదారి 161పై ఇటీవల తరచూ ప్రమా దాలు చోటుచేసుకుంటుండడంతో బేగంపూర్ చౌరస్తా, జుక్కల్ చౌరస్తా, జగనాథ్‌పల్లి ప్రాంతాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఎస్సై కోనారెడ్డితో మాట్లాడి ప్రమాదాలు జరగడానికి గల కారణాలను తెలుసుకున్నారు. ప్రమాదాలను అరికట్టేందుకు జాతీయ రహదారి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి చౌరస్తాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయనవెంట ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యకాంత్, ఇన్సిడెంట్ మేనేజర్ సౌరభ్‌ప్రతాప్, స్థానికులు ఉన్నారు.

బాబు భూ దోపిడీ ఖజానా!

అమరావతి ముసుగులో చంద్రబాబు బృందం అరాచకాలు

- యథేచ్ఛగా ప్రభుత్వ, ప్రైవేట్, అసైన్డ్ భూముల దురాక్రమణ
- శివరామకృష్ణన్ కమిటీ సిఫార్సులు బుట్టదాఖలు
- 'రాజధాని లీక్స్'పేరిట బురిడీ
- పక్కా పన్నాగంతో అమరావతి ఎంపిక
- బరితెగించి ఇన్‌సైడర్ ట్రేడింగ్..
- భయపెట్టి భూ మాయాజాలం
- అమరావతి కేంద్రంగా ఎల్లో గ్యాంగ్ రూ.లక్షల కోట్ల కుంభకోణం
- రాజధానిలో భూ బాగోతాలను కప్పిపుచ్చేందుకే శ్వేతపత్రం డ్రామా



సాక్షి, అమరావతి: ''ఏ''అంటే.. అమరావతి అని వక్కాణిస్తున్న సీఎం చంద్రబాబు రాజధాని ముసుగులో తన అవినీతి, అరాచకాలకు కేంద్రంగా చేసుకున్నారు! బరి తెగించి తాను పాల్పడిన అవినీతికి అక్షయ పాత్రలా మార్చారు! నాటి తెల్ల దొరలే తెల్లబోయేలా వ్యవహరించారు! బ్రిటీష్ పాలకుల సామ్రాజ్యవాద దోపిడీని మరిపిస్తూ టీడీపీ పెద్దలు సాగించిన భూ దోపిడీకి నిలువెత్తు సాక్ష్యం అమరావతి... బడుగులు, పేదలకు స్థానం లేకుండా చంద్రబాబు సృష్టించుకున్న నయా జమీందారీ వ్యవస్థకు నిదర్శనం అమరావతి! పచ్చ రాబందులు గుప్పిట పట్టిన రూ.లక్షల కోట్ల విలువైన భూ ఖజానా అమరావతి! దేశ చరిత్రలోనే అతిపెద్ద భూ దోపిడీకి మౌనసాక్షి అమరావతి!! ఈ భూ బాగోతాలు, తన నిర్వాకాలను కప్పిపుచ్చి మభ్యపెట్టేందుకే తాజాగా అమరావతిపై శ్వేతపత్రం అంటూ మరో డ్రామాకు చంద్రబాబు తెర తీశారు.

మోయలేని భారం మోపుతూ...

రాజధానిగా అమరావతి ఎంపిక చేసిన ప్రాంతం ఇటు విజయవాడ కాదు.. అటు గుంటూరూ కాదు. మూడు పంటలు పండే సారవంతమైన పంట పొలాల్లో నిర్మాణ వ్యయం తడిసి మోపెడవుతుందని చంద్రబాబు అండ్ కో కట్టిన లెక్కలే చెబుతున్నాయి. ఒక్క ఎకరాలో కనీస మౌలిక వసతుల కల్పనకు (బేసిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) రూ.2 కోట్లు వ్యయం అవుతుందని, మొత్తం రాజధాని ప్రాంతం అభివృద్ధి చేయడానికి రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చవుతుందని అప్పట్లోనే అంచనా వేశారు. ఏటా ఆ వ్యయం పెరగడమే కానీ తగ్గదు. విభజన అనంతరం రాష్ట్రం ఇప్పుడున్న పరిస్థితుల్లో అంత భారీగా నిధులు ఖర్చు చేయడం సాధ్యమయ్యే పని కాదని నిపుణులు చేసిన హెచ్చరికలను చంద్రబాబు పట్టించుకోలేదు. తాజాగా భారీగా నిధులు అవసరమంటూనే.. వివరాలు సేకరిస్తామని చెబుతున్నారు. అధికార పగ్గాలు చేపట్టిన మూడు వారాల్లోనే రూ.7 వేల కోట్లు అప్పు చేసిన టీడీపీ ప్రభుత్వం.. సంపదను ఎలా సృష్టించి రాజధాని నిర్మాణం చేస్తుందనే ప్రశ్నకు జవాబు లేదు.

భూములు లాక్కుని గాలి మేడలు..!

అమరావతి వేదికగా చంద్రబాబు సాగించిన భూ దందాను అప్పట్లోనే నిపుణుల నుంచి సామాన్యుల వరకూ అందరూ తీవ్రంగా వ్యతిరేకించారు. అమరావతి ప్రాంతం రాజధాని నిర్మాణానికి అనువైనది కాదని శివరామకృష్ణన్ కమిటీ స్పష్టం చేసింది. ఏడాదికి మూడు పంటలు పండే భూములను నాశనం చేయవద్దని పర్యావరణవేత్తలు అభ్యంతరం చెప్పారు. జీవనాధారమైన తమ భూములను కొల్లగొట్టవద్దని బడుగు, బలహీనవర్గాలు, పేద రైతులు వేడుకున్నారు. వారి విన్నపాలను బేఖాతర్ చేస్తూ చంద్రబాబు భారీ భూదోపిడీకి తెరతీశారు. అసైన్డ్ భూములను బినామీల ద్వారా హస్తగతం చేసుకుని పరిహారం ప్రకటించుకున్నారు. 2014–19 మధ్య రాజధాని పేరిట అమరావతి ముసుగులో చంద్రబాబు బృందం చేయని దురాగతం లేదు. అదిగో రాజధాని.. అల్లదిగో అమరావతి..! అంటూ అరచేతిలో వైకుంఠం చూపించారు. అంతకుముందు పక్కా పన్నాగంతో రాజధాని అక్కడ.. ఇక్కడ అంటూ పలు ప్రాంతాల పేర్లను తెరపైకి తెచ్చి సామాన్యులను బురిడీ కొట్టించారు. మరోవైపు ముందస్తుగా తాము భూముల కొనుగోలు చేసిన అమరావతిలో బినామీ మాఫియాను వ్యవస్థీకృతం చేశారు. అంతర్జాతీయ స్థాయి రాజధాని.. ఆకాశ హర్మ్యాల నగరం అంటూ గాలిలో మేడలు కట్టి రైతుల కాళ్ల కిందున్న భూమిని కాజేశారు.

పచ్చ దండు దురాక్రమణ..

దేశంలోనే కాదు ప్రపంచ చరిత్రలోనే అతి పెద్ద భూ దోపిడీకి చంద్రబాబు బరి తెగించారు. రాజధాని ప్రచారంతో మాయాజాలం... భూసమీకరణ ముసుగులో దోపిడీ... అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములు, లంక భూముల స్వాహా... ఇన్నర్ రింగ్ రోడ్డులో అవినీతి మలుపులు... అస్మదీయులకు యథేచ్ఛగా భూ పందేరాలు... ఇలా ఒకటేమిటి ఎన్ని రకాలుగా భూదోపిడీకి పాల్పడవచ్చో అన్ని విద్యలూ ప్రయోగించారు. అమరావతిపై చంద్రబాబు 'పచ్చ దండు'దండయాత్ర చేసి రూ.లక్షల కోట్ల విలువైన భూముల దురాక్రమణకు పాల్పడింది. చంద్రబాబుతోపాటు ఆయన కుటుంబ సభ్యులు, నాటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రులు, టీడీపీ నేతలు, వారి బినామీలు అమరావతి భూములపై వాలిపోయారు. చంద్రబాబు, లోకేశ్‌తోపాటు నారాయణ, సుజనా చౌదరి, ప్రత్తిపాటి పుల్లారావు, మాగుంట మురళీమోహన్, కొమ్మాలపాటి శ్రీధర్, కోడెల శివప్రసాద్ కుమారుడు శివరామకృష్ణ, ధూళిపాళ్ల నరేంద్ర, పయ్యావుల కేశవ్, బాలకృష్ణ వియ్యంకుడు ఎంఎస్‌పీ రామారావు.. ఇలా పచ్చ దండు అంతా అమరావతిలో భూములను కొల్లగొట్టింది. అన్యాయంగా, ఏకపక్షంగా విభజనకు గురై కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి ఆదిలోనే హంసపాదులా అభివృద్ధికి గండి కొట్టారు. తాత్కాలిక రాజధాని భవనాల పేరుతో కనికట్టు చేశారు.

మభ్యపుచ్చే యత్నాలు..

నాడు ఐదేళ్లలో భూముల దోపిడీకి పాల్పడటం మినహా టీడీపీ పెద్దలు రాజధాని కట్టిందీ లేదు.. అభివృద్ధి చేసిందీ లేదు. చంద్రబాబు బృందం సాగించిన భూ దోపిడీ ఇప్పటికే సీఐడీ దర్యాప్తులో పూర్తి ఆధారాలతోసహా బట్టబయలైంది. సీఐడీ న్యాయస్థానాల్లో చార్జిషీట్లు కూడా దాఖలు చేసింది. ఇక న్యాయ విచారణ ప్రక్రియ కొనసాగితే చంద్రబాబుకు యావజ్జీవ ఖైదు ఖాయమని న్యాయ నిపుణులు తేల్చి చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ అధికారంలోకి రాగానే చంద్రబాబు సరికొత్త కుట్రలకు పన్నాగం పన్నుతున్నారు. అమరావతిలో తన భూ బాగోతాన్ని కప్పిపుచ్చేందుకు శ్వేతపత్రం పేరుతో డ్రామాకు తెర తీశారు. రాజధాని నిర్మాణానికి తాను ఏం చేస్తానో చెప్పకుండా ఊక దంపుడు ఉపన్యాసంతో ఊదరగొట్టారు. రాజకీయ వ్యాఖ్యలు చేస్తూ తన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. కానీ అమరావతి పేరిట చంద్రబాబు యథేచ్ఛగా సాగించిన దోపిడీ దాచేస్తే దాగేది కాదు. ఇప్పటికే పూర్తి ఆధారాలతో సహా చార్జిషీట్ల రూపంలో నిక్షిప్తమైందన్నది నిఖార్సైన నిజం.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

శ్రీవారి సేవలో భారత మహిళా క్రికెటర్లు

తిరుమల: తిరుమల శ్రీవారిని మహిళా క్రికెటర్లు హర్మన్‌ప్రీతి కౌర్, షఫాలీ వర్మ, రేణుకా సింగ్, పూజా వస్త్రాకర్, దీప్తి శర్మ బుధవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు



తిరుమల ఆలయం వెలుపల భారత మహిళా క్రికెటర్లు

జస్టిస్ శరత్, రేవంత్‌ల ఫోన్లు ట్యాపింగ్

▶ మొదటి పేజీ తరువాయి

విచారణకు చేపట్టిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు కూడా జారీ చేసింది. తాజాగా ఈ అంశంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ టి.వినోద్‌కుమార్‌ల ధర్మాసనం బుధవారం మధ్యాహ్న విరామం తర్వాత విచారణ చేపట్టింది.

విచారణ 23వ తేదీకి వాయిదా..

ప్రభుత్వం తరఫున అడిషనల్ అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. ఫోన్ ట్యాపింగ్ కేసుపై అన్ని వివరాలతో కౌంటర్ దాఖలు చేశామని ధర్మాసనానికి వివరించారు. కేసు ఎప్పుడు నమోదు చేశారు? ఎవరెవరి ఫోన్లు ట్యాప్ అయ్యాయి? నిందితులెవరు? కేసు పురోగతి ఎంత వరకు వచ్చింది వంటి వివరాలు అందులో పేర్కొన్నామని.. కానీ ఇంకా రికార్డు కాలేదని చెప్పారు. ఈ వివరాలను రికార్డు చేయాలని కోర్టు అధికారులను ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణలోగా కౌంటర్ వేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది. కాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో తాను కూడా బాధితుడినేనని, పోలీసు అధికారుల నుంచి తీవ్ర వేధింపులు ఎదుర్కొన్నానని.. తనను ఈ పిటిషన్‌లో ఇంప్లీడ్ చేయాలంటూ సిద్దిపేట జిల్లాకు చెందిన హయతుద్దీన్ వేసిన పిటిషన్‌పై నిర్ణయాన్ని కూడా ధర్మాసనం వాయిదా వేసింది.

ప్రభుత్వం అఫిడవిట్లో పేర్కొన్న వివరాలివీ..

''నాయిని భుజంగరావు (ఏ3) వాంగ్మూలం మేరకు.. బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ఉన్న విద్యార్థి సంఘాలు, కుల సంఘాల నాయకులు, జర్నలిస్టులు, జస్టిస్ కాజా శరత్, ఇతర హైకోర్టు న్యాయమూర్తులు, ప్రభుత్వానికి సంబంధించిన కేసులను వాదిస్తున్న న్యాయవాదులు, పార్టీ నేతల వ్యక్తిగత జీవితం, చేసే పనులు తెలుసుకుని ప్రభుత్వానికి అనుకూలంగా ఉండేలా ప్రభావితం చేశారు. బీఆర్‌ఎస్‌కు ఇబ్బందికర పరిస్థితి వచ్చినప్పుడల్లా అవతలి వారి ఫోన్లు ట్యాప్ చేసి బెదిరించేవాళ్లు. హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో మాజీ మంత్రి ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలకు ఎర కేసులో, టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ అంశం సమయంలో ఫోన్ ట్యాపింగ్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. 'నేను కీలక వ్యక్తుల పేర్లు, ఫోన్ నంబర్లు సేకరించి ప్రణీత్‌కుమార్‌కు అందజేసేవాడిని. వారి ఫొటోలు, అడ్రస్‌లు సేకరించి చర్యలు తీసుకోవడం కోసం ఇంటెలిజెన్స్, లా అండ్ ఆర్డర్ పోలీసులకు పంపేవాళ్లం' అని భుజంగరావు చెప్పారు. టెలికం సర్వీస్ ప్రొవైడర్ల నుంచి వివరాలు సేకరించినట్టు, ఫోన్ నంబర్ చెబితే వారి కాల్‌లకు సంబంధించి వివరాలు కూడా సర్వీస్ ప్రొవైడర్లు ఇచ్చినట్టు తెలిసింది. జస్టిస్ కాజా శరత్, ఆయన సతీమణి మాధవి నంబర్లు, కాల్‌ల వివరాలు, అడ్రస్‌లు జియో ఆఫీస్ నుంచి తెలుసుకున్నారు.

కీలక వ్యక్తుల ఫోన్ ట్యాపింగ్..

సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కొండల్‌రెడ్డి, ఎనుముల తిరుపతిరెడ్డి, విజయ్‌రెడ్డి, కాంగ్రెస్ నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఈటల రాజేందర్, ఈటల నితిన్, శివధర్‌రెడ్డి, ఏఆర్ శ్రీనివాస్, రాఘవేందర్‌రెడ్డి, రోనాల్డ్ రోస్, ధర్మపురి అర్వింద్, ఎం.రమేశ్‌రెడ్డి, మేఘా శ్రీనివాస్‌రెడ్డి, మైనంపల్లి రోహిత్, పీడీ కృష్ణకిశోర్, ఐఏఎస్ దివ్య, తాటినేటి శశాంక్, రాజ్‌న్యూస్ సునీల్‌రెడ్డి, చిలుకా రాజేందర్‌రెడ్డి, కె.వెంకటరమణారెడ్డి, నరేంద్రనాథ్ చౌదరి, తీన్మార్ మల్లన్న (నవీన్), ఏఎంఆర్ ఇన్‌ఫ్రా మహేశ్‌రెడ్డి, వీరమళ్ల సత్యం, గాలి అనిల్‌కుమార్, రామసాయం సురేందర్‌రెడ్డి, కుందూరు రఘువీర్‌రెడ్డి, మేరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మేరెడ్డి స్వప్నిక, కాసాని జ్ఞానేశ్వర్, కొల్లే సరిత, అంజన్న (ఈటల గన్‌మన్), అనుమాండ్ల నరేందర్‌రెడ్డి, బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, మనాల మోహన్‌రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డితో పాటు మరికొందరి ఫోన్లను ట్యాప్ చేశారు.

మధ్యవర్తిగా టీవీ 5 సాంబశివరావు..

సంధ్య కన్వెన్షన్ శ్రీధర్‌రావు, టీవీ 5 సాంబశివరావులకు సంబంధించిన హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్ వివాదం ఉంది. ఈ పంచాయతీని సాంబశివరావు భుజంగరావు వద్దకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రావుపై చాలా క్రిమినల్ కేసులు ఉన్నాయని, వాటి నుంచి బయటపడాలంటే రూ.15 కోట్లు బీఆర్‌ఎస్‌కు పార్టీ ఫండ్‌గా ఇవ్వాలని భుజంగరావు ఒత్తిడి తెచ్చారు. శ్రీధర్‌రావు రూ.13 కోట్లు విలువైన బీఆర్‌ఎస్ బాండ్లు కొనుగోలు చేశారు. ఈ వ్యవహారంలో మధ్యవర్తిత్వం వహించిన సాంబశివరావు రూ.2 కోట్లు తీసుకున్నారని భుజంగరావు వాంగ్మూలంలో పేర్కొన్నారు..'' అని ప్రభుత్వం అఫిడవిట్‌లో తెలిపింది. వీటితోపాటు మరిన్ని వివరాలనూ వెల్లడించింది.

నిలిచిన నిధులు.. కదలని పనులు

- మధ్యలోనే ఆగిపోయిన సమీకృత మార్కెట్
- పట్టించుకోని అధికార యంత్రాంగం

పెర్కిట్(ఆర్మూర్): గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులు నిలిచిపోవడంతో నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోతున్నాయి. దీంతో ఆయా అభివృద్ధి పనులతో లబ్ధిపొందే వారు ప్రభుత్వాలపై విశ్వాసం కోల్పోతున్నారు. పెర్కిట్‌లో వెజ్ అండ్ నాన్ వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో బీజం పడింది. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం సమీకృత మార్కెట్ నిర్మాణానికి ప్రత్యేక నిధుల నుంచి రూ.7 కోట్ల 20 లక్షలు మంజూరు చేసింది. దీంతో 44వ నెంబరు జాతీయ రహదారి పక్కన శిథిలావస్థకు చేరుకున్న ఆర్‌అండ్‌బీ శాఖ కార్యాలయంతో పాటు అతిథి గృహాన్ని కూల్చి వేసి అదే స్థలంలో మార్కెట్ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు పనులను ప్రారంభించారు. మొదట్లో పనులు వేగవంతంగా జరిగినా ప్రభుత్వం మారడంతో నిధులు నిలిచిపోయి పనులు ఆగిపోయాయి. నిధులు రాకపోవడంతో కాంట్రాక్టరు చేతులెత్తేశాడు. దీంతో మార్కెట్ ఏర్పాటుపై నమ్మకం పెట్టుకున్న రైతులు, వ్యాపారులు నిరాశకు గురవుతున్నారు. పెర్కిట్ గ్రామం కూరగాయలు, చేపల మార్కెట్‌కు ప్రసిద్ధి గాంచింది. ప్రస్తుతం మార్కెట్‌ను 44వ నెంబరు జాతీయ రహదారి ప్రక్కన నిర్వహిస్తున్నారు. గ్రామం 44, 63వ నెంబరు జాతీయ రహదారుల కూడలిగా ఉండడంతో ఆర్మూర్‌తో పాటు సమీప బాల్కొండ, వేల్పూర్, జక్రాన్‌పల్లి మండలాలకు చెందిన రైతులు తాము పండించిన కూరగాయలను ఇక్కడ విక్రయిస్తారు. అలాగే వ్యాపారులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కూరగాయలను దిగుమతి చేసుకుని హోల్‌సేల్ వ్యాపారం చేస్తుంటారు. దీంతో మార్కెట్ నిత్యం కూరగాయల వ్యాపారులు, కొనుగోలుదారులతో రద్దీగా ఉంటుంది. అలాగే అక్కడి వచ్చే వారు తమ వాహనాలను రహదారిపై పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు ఆటంకం కలుగుతుంది. అలాగే మార్కెట్‌లో ఎలాంటి సౌకర్యాలు లేవు. కనీసం షెడ్లు సైతం లేకపోవడంతో రైతులు, వ్యాపారులు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ కూరగాయలు విక్రయిస్తున్నారు. తైబజార్ ద్వారా రూ.లక్షల్లో ఆదాయం పొందుతున్న మున్సిపల్ శాఖ ప్రస్తుత మార్కెట్‌లో ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదు. ప్రస్తుతం మున్సిపాలిటీకి తై బజార్ ద్వారా తొమ్మిది నెలలకు రూ.22 లక్షల 86 వేలు ఆదాయం సమకూరుతున్నా మార్కెట్‌లో ఎలాంటి వసతులు కల్పించడం లేదు. అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసి పనులు త్వరగా అయ్యేలా చూడాలని రైతులు, వ్యాపారస్తులు కోరుతున్నారు.



పెర్కిట్‌లో అర్ధాంతరంగా నిలిచిపోయిన మార్కెట్ నిర్మాణ పనులు



ప్రస్తుతం రహదారి పక్కన నిర్వహిస్తున్న కూరగాయల మార్కెట్

త్వరగా పూర్తి చేయాలి

సమీకృత మార్కెట్ నిర్మాణం ప్రారంభించి 8 నెలలు గడుస్తు న్నా పనులు ముందుకు సాగడం లేదు. పనులను త్వ రగా పూర్తి చేసి మార్కెట్‌ను అక్కడికి తరలించాలి. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడాలి.

– లలిత, కూరగాయాల వ్యాపారి, పెర్కిట్

నిధులు రాగానే పనులు చేపడుతాం

ప్రభుత్వం నుంచి నిధు లు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టరు ప నులు నిలిపివేశాడు. ని ధులు విడుదల కాగానే పనులు జరిపించేలా చర్యలు తీసుకుంటాం.

– రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

రోడ్డు మధ్యలోని విద్యుత్ స్తంభం తొలగింపు

భిక్కనూరు: మండల కేంద్రం నుంచి గిద్ద దళిత వాడుకు వెళ్లే దారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ట్రాన్స్‌కో అధికారులు బుధవారం అక్కడి నుంచి తొలగించి వేరే చోటుకు మార్చారు. కొన్నేళ్లుగా రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని కాలనీవాసులతో పాటు సమాచార హక్కు పరిరక్షణ కమిటీ జిల్లా ప్రతినిధి గంగల రవీందర్, ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. మంగళవారం భిక్కనూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ దృష్టికి పలువురు కాంగ్రెస్ నేతలు ఈ విషయాన్ని తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి ట్రాన్స్‌కో ఏఈలు శ్రీనివాస్, రామలక్ష్మిలను అడగ్గా విద్యుత్ స్తంభం మార్పు కోసం డిపార్టుమెంట్‌కు రూ.13 వేలు చెల్లించాలని తెలపగా వెంటనే షబ్బీర్ అలీ స్పందించి సొంత డబ్బులు రూ.13 వేలను అందజేశారు. దీంతో ట్రాన్స్‌కో అధికారులు బుధవారం విద్యుత్ స్తంభాన్ని నడిరోడ్డు నుంచి తొలగించి వేరే చోటుకు అమర్చారు. గిద్ద దళితవాడుకు చెందిన అంబేడ్కర్ సంఘం నేతలు పొట్టిగిని లక్ష్మణ్, నాగరాజు, సిద్ధరాములు, నర్సింలు, చామంతి మహేష్‌లు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి కృతజ్ఞతలు తెలిపారు.



వేరే చోటుకు మారుస్తున్న విద్యుత్ అధికారులు

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగు వ ప్రాంతాల నుంచి 3,762 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి 479 క్యూసెక్కులు తాగు నీటి అవసరాలకు, ఆవిరి రూపంలో పోతున్నాయి. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 1060.60(11.12టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.



ముడుపులు తీసుకుని మోసం

- పేస్కేల్ వర్తింప జేస్తామని రూ. 20 వేలు వసూలు
- తిరిగి చెల్లించడంలో యూనియన్, రాజకీయ నేతల మౌనం

మోర్తాడ్: మండల సమాఖ్యల్లో విధులు నిర్వహిస్తున్న అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు పేస్కేల్ అమలు చేయిస్తామని గత ప్రభుత్వ హయాంలో కొందరు అక్రమార్కులు ముడుపులు తీసుకొని మోసం చేశారు. గ్రామీణ పేదరిక నిర్మూలన పథకం కింద పని చేస్తున్న ఉద్యోగులకు గత ప్రభుత్వం పేస్కేల్ అమలు చేసింది. దీంతో మండల సమాఖ్యల్లో విధులు నిర్వహించే అకౌంటెంట్, కంప్యూటర్ ఆపరేటర్లకు కూడా పేస్కేల్ అమలు కావాలంటే తాము అడిగిన ముడుపులు ఇస్తే చేయిస్తామంటూ వారిని నమ్మించిన కొందరు అక్రమార్కులు డబ్బులు వసూలు చేశారు. సెర్ప్ ఉద్యోగులకు గతంలో మండల సమాఖ్యల నుంచి వేతనాలు ఇచ్చేవారు. సమాఖ్యలకు ఈ భారం తప్పించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం నేరుగా వేతనాలు చెల్లించడం ఆరంభించింది. వేతనాలు మాత్రం పెంచ లేదు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్న తమకు రెగ్యులరైజ్ చేయకపోయినా పేస్కేల్ వర్తింప చేయాలని సెర్ప్ ఉద్యోగులు డిమాండ్ చేయడంతో వాటిని అమలు చేసింది. ఫలితంగా సీసీలు, ఏపీఎంలు, డీపీఎంలకు పేస్కేల్ అమలైంది. మండల సమాఖ్యలోని కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్లకు మాత్రం సమాఖ్య ద్వారానే వేతనాలు చెల్లిస్తున్నారు. రూ.5వేల నుంచి రూ.16,500వేల వరకే వేతనాలు చెల్లిస్తుండటంతో తమ శ్రమకు గుర్తింపు లేకుండా పోయిందని ఉద్యోగులు వాపోతున్నారు. పేస్కేల్ అమలు చేస్తే కనిష్టంగా రూ.22వేల వేతనం లభిస్తుంది. పేస్కేల్ అమలు చేయించడానికి కొందరు యూనియన్ నాయకులు, నాటి అధికార పార్టీ నాయకులు ఒక్కొక్కరి నుంచి రూ.20వేల చొప్పున వసూలు చేశారు. జిల్లాలో సుమారు 54 మంది నుంచి రూ.10.80లక్షలు వసూలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో పేస్కేల్ అమలు చేయకపోగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒప్పించి వేతనాలు పెరిగేలా చూస్తామని నాయకులు చెబుతున్నా ఆచరణలో సాధ్యం కావడం లేదు. దీంతో ముడుపులు స్వీకరించిన వారు ఉద్యోగులకు సమాధానం చెప్పకుండా మొఖం చాటేయడంతో ఏం చేయాలో తెలియక ఆపరేటర్లు, అకౌంటెంట్లు తలలు పట్టుకుంటున్నారు.



ఆరుతడి పంటలకు ఆయువు

- నిత్యం మోస్తరుగా కురుస్తున్న వర్షం
- పచ్చదనం సంతరించుకుంటున్న పొలాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

బాల్కొండ: నిత్యం ఏదో ఒకచోట వర్షం కురుస్తునే ఉండటంతో ఆరుతడి పంటలకు ఆయువచ్చినట్లయిందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంటల సాగుపై అన్నదాతలకు ఎలాంటి ఆందోళన లేకుండా వర్షం నిత్యం మోస్తారుగా కురుస్తుంది. దీంతో సాగు చేసిన మక్క, సోయా పంటలు పచ్చదనం సంతరించుకుంటున్నాయి. వర్షాలు కురుస్తుండటంతో అన్నదాతలు మక్క పంటకు యూరియా మందు వేస్తున్నారు. సోయా పంటలో చీడ పీడల నివారణ కోసం పురుగుల మందు పిచికారి చేయుటకు నేలలో తేమ శాతం ఉండాలి. వర్షం కురువడం వలన నేలలో తేమ శాతం ఉంటుంది. దీంతో రైతులకు పంటలకు నీరు అందించే తిప్పలు తప్పుతున్నాయి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో మక్క, సోయా, పసుపు లాంటి ఆరుతడి పంటలను రైతులు సాగుచేశారు. భారీ వర్షాలు కురువకున్నా ఆరుతడి పంటలను ఆదుకునేలా వరణుడు కరుణించడంపై అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ముప్కాల్‌లో సాగవుతున్న మక్కపంట

వరి సాగుపై సందిగ్ధత..

ప్రస్తుత వర్షాలతో వరి సాగు సందిగ్ధంగా ఉంది. వరి నారుమడులు ఇదివరకే రైతులు సిద్ధం చేశారు. కానీ ప్రధాన పొలం వేయుటకు నీరు అధికంగా అవసరం ఉంటుంది. భూగర్భ జలాలు కూడ అంతంత మాత్రంగానే ఉండటంతో ఊట బావుల్లో, బోరు బావుల్లో నీరు అధికంగా ఉండటం లేదు. ప్రాజెక్టులు కూడ నీరు లేక వెలవెల బోతున్నాయి. దీంతో వరి సాగు చేయుటకు ఇంకా సమయం ఉన్నప్పటికీ భారీ వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆర్మూర్ డివిజన్‌లో ప్రధానంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి అధికంగా నీటి సరఫరా ఉంటుంది. జూలై మొదటి వారం వచ్చినా ఇప్పటికీ పెద్ద వరదలు రావడం లేదు. దీంతో వరి సాగుపై నీలినీడలు కమ్మినట్లుగా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు వరకు వరి నాట్లు వేసే అవకాశం ఉండటంతో వర్షాలు కురుస్తాయన్న ఆశతో అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.



సోయాపంట

పంటలకు డోకా లేదు..



ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల ఆరు తడిపంటలకు ఎలాంటి డోఖా లేదు. నిత్యం కొద్దిపాటి వర్షం అయిన కురుస్తుంది. మక్క పంటకు యూరియా మందు పెట్టాం. తడి ఇవ్వకుండ వర్షం ఆదుకుంటుంది. వరి పంట సాగు చేయుటకు కావల్సిన నీరు ఉండటం లేదు.

– గంగారెడ్డి, రైతు, ముప్కాల్